క్లుప్తంగా

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి: మండలంలోని కొత్తపల్లిచెరువు వద్ద మట్టి తరలింపును అడ్డుకున్న సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామిపై దాడి చేసిన టీడీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సవిత అండదండలతో మట్టి మాఫియా నియోజకవర్గంలో రెచ్చిపోతోందన్నారు. అక్రమాలను ప్రశ్నించిన సీపీఐ నాయకుడిపై మూకుమ్మడిగా దాడి చేసి జర్నలిస్టులను బెదిరించడం తగదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యాక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారికి డయేరియా


డయేరియా బారిన పడిన అభయరెడ్డి

రొద్దం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు అభయరెడ్డి (3)కు డయేరియా సోకింది. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చిన్నారిని తీసుకువచ్చారు. అయితే స్టాఫ్ నర్సు డ్యూటీ దిగే సమయంలో చిన్నారిని హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని రెఫర్ చేసినట్లు తెలిసింది. దీంతో 108 సిబ్బంది చిన్నారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వన్నెరప్ప


అధ్యక్ష, కార్యదర్శులను పూలమాలలతో సత్కరిస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వన్నెరప్ప , ప్రధాన కార్యదర్శిగా పీవీ రామచంద్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారి రఘునాథరెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్ష స్థానానికి వన్నెరప్ప, గోపాల్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన కార్యదర్శి స్థానం కోసం రామచంద్రప్ప, కృష్ణమూర్తి, మురళీ పోటీ పడ్డారు. అయితే సీనియర్ న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేసిన వారితో మాట్లాడి ఏకగ్రీవానికి చర్యలు తీసుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని న్యాయవాదులు శ్రీరాములు, రామిరెడ్డి, నాగరాజురెడ్డి, ఏపీపీ ఇందాద్, శివ శంకర్, నాగరాజు, హిదయతుల్లా, సిద్ధూ, ఎజీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గైనకాలజీ సమస్యలపై అవగాహన



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామంలో శుక్రవారం ఉదయం వాసవీ మహిలా మండలి, విప్రో కేర్స్ సహకారంతో కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో గైనిక్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 61 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. అనంతరం డాక్టర్ అనుషా గైనకాలజీ సమస్యలపై మహిళలకు అవగాహన కల్పించారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి


శిక్షణ పొందుతున్న మహిళలు

హిందూపురం: గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించి కుటుంబ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని డిల్లీకి చెందిన లైఫ్లీ హుడ్ ట్రైనర్ సంజయ్ సూచించారు. సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదర్శ గావ్ పథకం కింద హిందూపురం మండలంలోని గోళాపురంలోని స్వయం సహాయక బృందానికి చెందిన మహిళలకు ఉపాధి శిక్షణ కింద హ్యాండ్ వాష్, డిష్ వాష్ తదితర ఉత్పత్తుల తయారీలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. శత్రుఘ్నలాల్ కశ్యప్, సూర్య ఫౌండేషన్ జోన్ ఇన్‌చార్జి శివకుమార్ రాజ్వాడే, తివారీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం ఏదీ?



వ్యవసాయ రంగంలో రోజురోజుకూ కూలీల కొరత వేధిస్తోంది. సేద్యంలో పెట్టుబడుల భారం పెరిగిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఉపాధి హామీ పథకానికి వ్యవసాయం అనుసంధానం డిమాండ్ ఎన్నో రోజులుగా ఉన్నా ఆ దిశగా ప్రభుత్వాలు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. 2014లో అధికారంలోనే వ్యవసాయాన్ని ఉపాధి పథకానికి అనుసంధానిస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించింది. కనీసం ఇప్పుడైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


వేరుశనగ విత్తనాలు విత్తుతున్న దృశ్యం (ఫైల్)

- కలగానే మారిన 'ఉపాధి'కి వ్యవసాయం అనుసంధానం
- పెరిగిన ఖర్చులతో అన్నదాతల ఇబ్బందులు
- 2014లోనే అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ
- నేటికీ పట్టించుకోని వైనం

మడకశిరరూరల్: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతుల డిమాండ్ చాలా కాలం నుంచి ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప అమలు చేయడం లేదు. కూలీలు ఉపాధి పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. 2014 సంవత్సరంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉపాధి వ్యవసాయానికి అనుసంధానం అమలు చేసే దశగా ఆలోచన చేయడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

అప్పులతో తిప్పలు

మడకశిర డివిజన్‌లోని మడకశిర, అగళి, అమరాపురం, రొళ్ల, గుడిబండ మండలాల్లో రైతు బోరు బావుల కింద ఖరీఫ్, రబీ సీజన్‌లో వేరుశనగ, రాగి, పత్తి, వరి, మొక్కజొన్న, టమాట, ముద్ద బంతి, దానిమ్మ, అరటి తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఉన్న భూమి బీడుగా ఉంచకూడదన్న ఉద్దేశంతో వారి అప్పులు చేసి మరీ పంటలను సాగు చేస్తున్నారు. వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ సాగిస్తూ చేసి అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నారు. పంటలో నష్టాలు వచ్చినప్పుడు అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేపోతున్నారు. పంటలను బట్టి ఎకరాకు దాదాపు రూ.20 వేల వరకు ఖర్చులు భరించాల్సి ఉంటుంది. వ్యవసాయానికి ఉపాధి అనుసంధానం చేస్తే కూలీ ఖర్చుతో పాటు రైతులకు కొంత వరకూ పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. కేంద్రంపై ఒత్తిడి పెంచి ఉపాధి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలోని భూమి, జాబ్‌కార్డుల వివరాలు

మండలం	వ్యవసాయ భూమి (ఎకరాల్లో)	జాబ్‌కార్డులు
మడకశిర	29,000	10,052
రొళ్ల	16,000	6,857
అగళి	10,000	6,870
గుడిబండ	26,000	9,950
అమరాపురం	23,000	8,625


ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు (ఫైల్)

కూటమి ప్రభుత్వం స్పందించాలి



అప్పులు చేస్తే తప్ప వ్యవసాయం చేయలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. దాని వల్ల రైతులతో పాటు కూలీలకు ఎంతగానో మేలు జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడం తప్ప ఆదాయం చేతికందే పరిస్థితులు లేవు.

– శ్రీరామరెడ్డి, ఎల్లొటి, మడకశిర మండలం

ఉపాధికి అనుసంధానించాలి



అప్పులు చేసి పంటలను సాగు చేయడం కష్టంగా ఉంది. ఉపాధి హామీ పథకానికి వ్యవసయాన్ని అనుసంధానం చేయాలి. ఏ పంట సాగు చేయాలన్నా అప్పులు భారం పడుతోంది. కానీ పంటలో లాభాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం ఉపాధికి వ్యవసాయాన్ని అనుసంధానిస్తే మేలు జరుగుతుంది.

– రవికుమార్, తురుకువాండ్లపల్లి, మడకశిర మండలం

ఖర్చుల భారం తగ్గించండి



రైతులకు పంటల సాగు భారంగా మారుతోంది. అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందకపోవడంతో అప్పులు భారం పెరుగుతోంది. ప్రభుత్వం రైతుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అప్పుడే రైతుకు కొంత ఖర్చుల భారం తగ్గుతుంది.

– నరసింహమూర్తి, కదిరేపల్లి, మడకశిర మండలం

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	35.0
పెనుకొండ	37.0
మడకశిర	35.0

పంచాయతీ స్థలంలో హాస్టల్ ఎలా నిర్మిస్తారు?


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచ్ సంధ్య, పంచాయతీ కార్మికులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న పంచాయతీ స్థలంలో నూతన హాస్టల్ భవనం మంజూరైంది. అయితే అది పంచాయితీ స్థలం కావడం, ఆ స్థలంలో వారపు సంత నిర్వహిస్తుండటంతో సర్పంచ్ సంధ్య ఆ భవన నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. ఆ స్థలంలో హాస్టల్ భవనం నిర్మిస్తే సంత ఎక్కడ నిర్వహించుకోవాలని ప్రశ్నించారు. అనంతరం సీపీఎం నేతలతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

పెనుకొండ: ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న నిర్వహించనున్న చలో కలెక్టర్‌ను జయప్రదం చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు హరి, బాబావలి, గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ జగనన్న, టిడ్కో ఇళ్లు పూర్తీ చేసి లబ్దిదారులకు వెంటనే అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లను పేదలకు వెంటనే ఇవ్వాలన్నారు. లైనింగ్ పనులు ఆపి హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి అన్ని వర్గాల వారు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు తిప్పన్న, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవలు, అష్టోత్తర, విష్ణుసహస్ర నామాలు, అంకురార్పణ, కుంకుమార్చన, అభిషేకం పూజలు చేశారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని స్థానిక సీపీఐ కాలనీలోని కేజీబీవీలో 2025–26 సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతి (బైపీసీ)లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. అలాగే 7, 8, 9, 10వ తరగతులు, 12వ తరగతి(బైపీసీ)లో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 11 లోపు http//:apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, 11వ తరగతిల్లో ప్రవేశాల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ నీలిమా ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

అమరాపురం: మండలంలోని గృహ, వ్యవసాయం తదితర వాటి విద్యుత్ బకాయిలను వందశాతం వసూలు చేయాలని ఆశాఖ ఏడీ రఘు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పంచాయతీల వారీగా ఎంతెంత బకాయిలు ఉన్నాయి. తదితర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ. సిద్దేశ్వర, జేఏఓ శ్రీనివాస్ పంచాయతీ లైన్‌మెన్లు ఉన్నారు.

వైఎస్సార్ పేరును తొలగించడం దుర్మార్గం

అమరాపురం: విశాఖపట్నంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును మార్చడం దుర్మార్గమని ఎంపీపీ ఈరన్న విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 108, ఆరోగ్యశ్రీ , ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర పథకాలతో పేదల గుండెల్లో గూడుకట్టుకున్న మహానేత పేరును తొలగించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారికంగా పేరును తొలగించినా ప్రజల హృదయాల నుంచి వైఎస్సార్‌ను తీసివేయలేరన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరు స్టేడియానికి పెట్టాలని డిమాండ్ చేశారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం చూపండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఈ

అమరాపురం: 'మండల పరిధిలోని చిట్నడకు గ్రామంలో బోరు బావుల కింద సాగు చేసిన పంటలకు ఓల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో కొత్తగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని చూపండి' అని విద్యుత్‌శాఖ ఏఈ సిద్దేశ్వర శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహకు వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

అగళి: మండలంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించుకుందామని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఇరిగేషన్, దేవదాయ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, అటవీశాఖ, రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను పరిరక్షించుకునేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఇతరులు కబ్జా చేయడానికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్, ఇరిగేషన్, పీఆర్ ఇంజనీరింగ్‌శాఖ ఉదోగులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ వీరాంజినేయులుతో పాటు పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో ప్రభుత్వ స్థలాలు, భూములు, గ్రామ కంఠంతో పాటు ఉమ్మడి వనరులు, ఇతరాత్ర భూములు అన్యాక్రంతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్యాక్రాంతమైన భూములు గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని మండలస్థాయి అధికారులకు తహసీల్దార్ లక్ష్మీనరసింహ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఇంజినీర్లు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఇషాక్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాల కార్మిక రహిత సమాజమే ధ్యేయం

పెనుకొండ: బాల కార్మికులు లేని సమాజమే ధ్యేయమని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. అగరబత్తీ తయారీ యూనిట్లు ఆ దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్ నిర్వహించిన అధ్యయనంతో 82 శాతం మంది ప్రతివాదులు అగర్‌బత్తీల పరిశ్రమలో బాలకార్మికులను చూడలేదని, 8 శాతం మాత్రమే బాల కార్మికులను చూపినట్లు పేర్కొన్నారన్నారు. అగరబత్తీ యూనిట్లున్న అన్ని ప్రాంతాల్లో బాల కార్మికులను లేకుండా చేయడమే సమతా స్వచ్ఛంద సంస్థ లక్ష్యమన్నారు.

పదో తరగతి విద్యార్థినికి గాయాలు

అమరాపురం: మండల కేంద్రానికి చెందిన హనుమంతరాయప్ప కుమార్తె పదోతరగతి విద్యార్థిని గానవిని గుర్తుతెలియని ద్విచక్ర వాహనం శుక్రవారం మధ్యాహ్నం ఢీకొంది. తలకు దెబ్బతగలడంతో వెంటనే స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు. చెవిలో రక్తం వస్తుండటంతో మెరుగైన వైద్యం కోసం మడకశిర ఆస్పత్రికి తరలించారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని, గానవి ఆరోగ్యం బాగుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను సీఐ రాఘవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

24న కౌన్సిల్ సమావేశం

పెనుకొండ: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 24న సోమవారం జరుగుతుందని కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. 11 గంటలకు బడ్జెట్ సమావేశం , 12 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన జరుగుతుందన్నారు.

విజయవాడ నుంచే హజ్‌యాత్ర కొనసాగేలా చూడాలి

హిందూపురం: విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ఎంబార్కేషన్ పాయింట్‌ను తొలగించడం దుర్మార్గమని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్‌ఖాన్ విమర్శించారు. ఎన్‌డీయే ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని ఆరోపించారు. విమానయానశాఖా మంత్రి మన రాష్ట్రానికి చెందిన వారే అయినా ముస్లింలకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం జోక్యం చేసుకొని విజయవాడ నుంచి హజ్ యాత్ర కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు

గుడిబండ: మండలంలో ఐదెకరాల్లోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీతో వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందించనున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, టిల్లర్లు, గుంటకలు, రోటోవేటర్, పవర్ వీడర్‌తో పాటు గుంటకలు, పవర్ వీడర్, మడకలు ఇతరాత్ర వాటిని అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఏఓ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

కార్యదర్శిపై చర్య తీసుకోండి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటబాబ్జిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తికి సచివాలయం సిబ్బంది శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పంచాయితీ కార్యదర్శిలు చేయాల్సిన పీఆర్1 యాప్ పనిని కూడా సచివాలయ సిబ్బందే చేయాలని, దీంతో పాటు వివిధ పనుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారన్నారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు మండల టాస్క్‌పోర్సు కమిటీని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అధ్యక్షతన ఎంపిక చేశారు. ఎంపీడీఓ, ఎస్ఐ, ఫారెస్టు అధికారి, ఇరిగేషన్ ఏఈ, ఆర్అండ్‌బీ ఏఈ, ఎండోమెంట్ అధికారులు, పంచాయతీరాజ్ ఏఈ సభ్యులుగా ఉంటారని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే కమిటీ ధ్యేయమన్నారు.

ఆర్డీటీకి విరాళం

గోరంట్ల: మండల పరిధిలోని కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు ద్వారా రూ. 30,116లను శుక్రవారం ఆర్‌డీటీ సంస్థ విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని ఆర్డీటీ ప్రతినిధి నరసింహమూర్తికి హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు శుక్రవారం అందించారు.

వైభవంగా స్వారమ్మదేవి జాతర


అలంకరణలో స్వారమ్మదేవి


సిడిమాను ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని మద్దె కరెక్యాతనహళ్లి గ్రామంలో స్వారమ్మ దేవి, శంకరలింగేశ్వరస్వామి జాతరోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన సిడిమాను ఉత్సవం ఘనంగా జరిగింది. వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వారమ్మదేవికి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు బాయి బీగ (నోటి తాళం), బెళ్లార్తి(చేతి వేళ్ల హారతులు) పద్ధతులతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.